క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా కిరణ్



కిరణ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ప్రదీప్ తదితరులు

తలకొండపల్లి: ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా కిరణ్‌ను ఎన్నుకున్నారు. మహాజన్ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌గౌడ్ సమక్షంలో గురువారం రాత్రి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కిరణ్‌కు ప్రదీప్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిరణ్ ఎమ్మార్పీఎస్ అభివృద్ధికి అంకితభావంతో పని చేశాడని కొనియాడారు. ఈ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందని కిరణ్ అన్నారు.

ముదిరాజ్‌లపై కేసీఆర్ చిన్నచూపు



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, ఒక్కరికి కూడా ఎమ్మెల్యే టికెట్ కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ వైఖరికి నిరసనగా ఆయన దిష్టిబొమ్మను తలకొండపల్లిలో దహనం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జనాభా దామాషా ప్రకారం ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాండు, అనిల్, నాగరాజు, హరీష్, బాలయ్య, రవి, చెన్నకేశవులు, శ్రీను,గణేశ్, నరేశ్, శ్రీనివాసులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషక మాసోత్సవంలో అంగన్‌వాడీ టీచర్లు

తలకొండపల్లి: పోషకాలున్న ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్ నస్రీన్‌బేగం అన్నారు. పోషక మాసోత్సావాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధిలోని వెల్జాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం 3లో తల్లులు, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నస్రీన్‌బేగం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, తల్లులు పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా పంపిణీ చేసే బాలామృతం, పాలు, గుడ్లు, విటమిన్‌లతో కూడిన ఆహారపదార్థాలు ఎంతో బలవర్థకమైనవన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు యశోదమ్మ, రాజమణి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్

తుర్కయంజాల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ హెచ్చరించారు. శుక్రవారం పురపాలక సిబ్బంది, స్వచ్ఛ ఆటో కార్మికులతో కలిసి తుర్కయంజాల్‌లోని దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. ప్రతి దుకాణం తిరుగుతూ, చెత్తను బయట వేయొద్దని, అలా వేస్తే రూ. 500 నుంచి రూ. 5వేల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పంపిణీలో చేతివాటాన్ని సహించం

ఇబ్రహీంపట్నం: నాసిరకం చేప పిల్లలను పంపిణీ చేస్తే ఊరుకునేదిలేదని టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం ఇబ్రహీంపట్నంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మత్స్యకారుడికి రూ. 5 లక్షల వ్యక్తిగత రుణాలు ఇవ్వాలన్నారు. చేప, రొయ్య పిల్లల పంపిణీలో ఏలాంటి అవినీతి, అవకతవకలు లేకుండా చూడాలన్నారు. దళారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, నగేశ్, రాములు, యాదయ్య పాల్గొన్నారు.

మళ్లీ మాదే అధికారం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- పలు పనులకు భూమిపూజ
- బీసీ కులవృత్తిదారులకు చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభంతో పాటు, రూ.20 లక్షలతో నిర్మించనున్న స్త్రీ శక్తి భవన నిర్మాణానికి, రూ.50 లక్షలతో నిర్మించనున్న ఎంపీడీవో భవన నిర్మాణానికి, రూ.20 లక్షలతో చేపడుతున్న ఉప్పరాశి కుంట సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల్, తలకొండపల్లి మండలాలకు చెందిన 186 మంది బీసీ కులవృత్తుల లబ్ధిదారులకు మంజూరైన రూ.1.86 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు, పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన పాలమూర్ -రంగారెడ్డి ప్రాజెక్టుతో కల్వకుర్తి నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేకు వినతి

మండల కేంద్రంలో బస్టాండ్, ఆస్పత్రి, కళాశాల ఏర్పాటు చేయాలని పలువురు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఆనంద్, ఆనంతరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్ నిరసన

బీసీ కులవృత్తుల లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరుగలేదని, వందలాది మంది దరఖాస్తు చేసుకుంటే, ముగ్గురినే పథకానికి ఎంపిక చేశారని కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులనే ప్రభుత్వ పథకాలకు ఎంపిక చేస్తున్నారని విమర్శించారు. పార్టీలకతీతంగా అర్హులను గుర్తించి ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. సమస్య ఉంటే వినతిపత్రం అందించాలని, మరో విడుతలో అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యే హామీతో సంతృప్తి చెందని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సమస్యలను పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న దశరథం

ఆమనగల్లు: నాయీబ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయీబ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కానుగుల దశరథం డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 12న నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవ మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తమకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర నామినేటెడ్ పదవులలో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని కోరారు. దేవాదాయశాఖలో పనిచేస్తున్న వాయిద్య కళాకారులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల నాయీబ్రాహ్మణసంఘం అధ్యక్షుడు గణేశ్, పట్టణాధ్యక్షుడు రమేశ్, నాయకులు పెరికేటి యాదయ్య, నాగేశ్, కోటయ్య, రవి, బాలు, శేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాత బండ్ల బోనాలు



దుర్గమాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌లో శుక్రవారం దుర్గమాత బండ్ల బోనాలను ఘనంగా నిర్వహించారు. నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శివ సత్తుల ఆటపాట, పోతురాజుల విన్యాసాలు పలువురిని అలరించాయి. బోనాల ఉత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దుర్గమాతను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, సర్పంచ్ రమేశ్, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ నర్సింహ, మార్కెట్ చైర్మన్ శ్రీనివాసురెడ్డి, జెడ్పీటీసీ విజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత ఆర్థికంగా ఎదగాలి

కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి



డ్రైవింగ్ లైసెన్స్ శిబిరాన్ని ప్రారంభించిన రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: యువత అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్- యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యా, వైద్యం, ఉపాధి కల్పనే లక్ష్యంగా, అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో యువతీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించేందుకు, శిబిరాలను మండలాల వారీగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ, మహేశ్, నాయకులు రాఘవేందర్, లింగం, రఫీ, ఇమ్రాన్‌బాబా, శ్రీకాంత్, విజయ్, రాజేశ్, వంశీ, చందు తదితరులు ఉన్నారు.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం



ప్రత్యేక అంకరణలో అమ్మవారు

యాచారం: నందివనపర్తి గ్రామంలోని శ్రీ జ్ఞానసరస్వతిదేవి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాస చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జ్ఞాన సరస్వతి సేవా సమితి, మాతృమండలి ఆధ్వర్యంలో 80 మంది మహిళలతో వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణంతో పేరు ప్రఖ్యాతలు సాధించినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయ మండలి సభ్యులు రాఘవేందర్‌శర్మ, శివకుమార్, నిఖిల్, అంజయ్య, రుద్రమ్మ, దీపిక, రాణి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది



ప్రధానోపాధ్యాయురాలు విజయను సన్మానిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: విద్యార్థులను భావి భారతపౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం కడ్తాల్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత, స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల్లో కల్లా ఎంతో గొప్పదని, ఉపాధ్యాయులను సన్మానించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుగుణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం



కిషన్‌రెడ్డి

ఆమనగల్లు: మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొల్కులపల్లి ఎంపీటీసీ కిషన్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా రెండేళ్లుగా కిషన్‌రెడ్డి పనిచేస్తున్నారు. తిరిగి మరోసారి ఆయనకు బాధ్యతలు కట్టబెట్టారు.

జాబితాకు ఆమోదం..

తలకొండపల్లి: మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా డోకూరి ప్రభాకర్‌రెడ్డి, కడ్తాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బిచ్యానాయక్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు వీరిని అధ్యక్షులుగా కొనసాగాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆమోదించినట్లు వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ తెలిపారు.

ఘనంగా గురుపూజోత్సవం

యాచారం: మండలంలోని చింతపట్ల, కుర్మిద్ద ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చింతపట్ల ఉన్నత పాఠశాలలో మన ఊరు- మన బడి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేశ్ నేతృత్వంలో గురుపూజోత్సవం జరిగింది. కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో కూడా గురుపూజోత్సవం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కుర్మిద్ద ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

బీఆర్ఎస్‌తోనే ప్రజలకు మేలు

- కాంగ్రెస్, బీజేపీని ఎవరూ నమ్మరు
- కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయం
- అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సీపీఎం, కాంగ్రెస్ శ్రేణులు

యాచారం: బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని తెలిపారు. మండల పరిధిలోని చింతుల్ల గ్రామానికి చెందిన 50 మంది సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీలకు చెందిన కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోనే అందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా చేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలకు క్యాడర్ లేదని ఎద్దేవాచేశారు. నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి మరోమారు గెలిపించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి చూసి అన్ని రాజకీయ పక్షాలు బీఆర్ఎస్‌లో చేరుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో సీపీఎం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ, చింతుల్ల గ్రామ కమిటీ మాజీ కార్యదర్శి జంగయ్య, వార్డు సభ్యుడు వెంకటేశ్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, చింతుల్ల గ్రామ సర్పంచ్ సబిత తదితరులు పాల్గొన్నారు.

నేడు మంచాలకు ఎమ్మెల్యే

మంచాల: నేడు మంచాల మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. శనివారం ఉదయం 10-30 గంటలకు లింగంపల్లి గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు, మనోహరబాద్‌లో సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించనున్నారు. అనంతరం మంచాలలో సీసీ,బీటీ రోడ్డు, జాపాలలో అండర్ డ్రైనేజీ పనులు, ఆరుట్లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం, బీసీ కమ్యూనిటీ హాల్, తాళ్ల పల్లి గూడ నుంచి చిత్తాపూర్ వరకు పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణం పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ఇబ్రహీంపట్నం: అనారోగ్యంతో చికిత్స పొందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. దండుమైలారం గ్రామానికి ప్రియాంక, అశోక్‌కు రూ. 60 వేలు, రాణికి రూ. 36 వేలు, తరుణ్‌కు రూ. 20 వేలు, నవీన్‌కు రూ.18 వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఐలేశ్, చీమల జగన్నాథం, జగదీశ్, లింగం, రవీందర్ లున్నారు.

నిరుద్యోగులతో చెలగాటం



మధుసూధన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయ పోస్టులను పెంచాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాట మాడుతోందని మండిపడ్డారు. ఆరు వేల టీచర్ ఉద్యోగాల భర్తీకి కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 23 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అందులో సగం పోస్టులను కూడా భర్తీ చేయకపోవడంతో డీఎడ్, బీఎడ్ చదివిన నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. వెంటనే 13 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని మధురానగర్‌లో ప్రజా ప్రయోజనార్థం వదిలిన ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తు లు ప్రహరీ నిర్మిస్తుండగా కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 200 గజాల పార్కు స్థలంలో గతంలో గ్రామ పంచాయితీ పాలకవర్గం ప్రజల అవసరాల కొరకు మంచినీటి బోరును కూడ వేయించిందని గుర్తుచేశారు. తప్పుడు పత్రాలతో స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు జోక్యంతో పనులను నిలిపేశారు. అధికారులు వెంటనే స్పందించి కబ్జాకు యత్నిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకుని పార్కు స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు బీఆర్ఎస్ నాయకుడు గుత్తి బాలస్వామిని శుక్రవారం పలువురు పరామర్శించారు. ఇటీవల దాడిలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ జంగయ్య, మాజీ సర్పంచ్ కేశవులు, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు సాయిలు, మల్లేశ్‌నాయక్, వెంకటయ్య పరామర్శించారు.

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ రాములు, మండల నాయకుడు నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ మేడే సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన వేతనాలను పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25 లక్షలు ఇన్సూరెన్స్, దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు జగన్, దర్శన్, సురేశ్, శివరాజు, లింగమయ్య, సుజాత, సంతోష పాల్గొన్నారు.

ఆదర్శంగా ఆమనగల్లు 'లయన్స్'

లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి



అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమం పేరిట పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ డా.దామోదర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నకిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. మారుమూల గ్రామాలకు లయన్స్ సేవలను విస్తరిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీఆర్ఓ పాషా, కోశాధికారి వెంకటయ్య, సభ్యులు కేశవులు, రామ్మోహన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిరకాల వాంఛ నెరవేరేనా?

జేఏసీ నాయకుడు రేణురెడ్డి

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామం మండల కేంద్రంగా ఏర్పాటయ్యేనా, గ్రామ ప్రజల చిరకాల వాంఛ నెరవేరేనా అని జేఏసీ నాయకుడు రేణురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 68వ రోజుకు చేరుకున్నాయి. ధర్నాలు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఏలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా మండలంగా ప్రకటించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దామోదర్, చంద్రయ్య, లక్ష్మణరావు, శివయ్య, డేవిడ్, వెంకటేశ్, దర్గారెడ్డి, రాధాకృష్ణ, పవన్, రమేశ్, చెన్నయ్య, ఈదమయ్య, ముత్యాలు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



గట్టుఇప్పలపల్లిలో దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు